
www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 8 ఏప్రిల్ 2024

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

రక్షణకు, ఉద్యోగాలకు 'తైక్వాండో' దోహదం

ప్రజాశక్తి-అంబాజీపేట

తైక్వాండో శిక్షణ ఆత్మ రక్షణే కాకుండా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందేందుకు దోహదపడతాయని ఎస్ఐ కె.చిరంజీవి అన్నారు. అంబాజీపేట హైస్కూల్ నందు ఆదివారం న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ సర్టిఫికెట్ లు విద్యార్థులకు అందజేశారు. తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ గేమ్ క్రమం తప్పకుండా నేర్చుకుని మరెన్నో విజయాలు సాధించాలని ఎస్ఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్ పి.త్రిమూర్తులు మరియు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎస్ఐ చిరంజీవి

దళిత యువకులపై దాడి

- ఇటుక రాళ్లు, గాజు సీసాలతో తెగబడిన వైనం
- ఒకరి పరిస్థితి ఆందోళనకరం
- మరికొందరి యువకులకు గాయాలు
- భారీగా పోలీసుల మొహరింపు
- ఘటనపై పెదవి విప్పని పార్టీలు



కడియపు సావరంలో మొహరించిన పోలీసులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపు సావరం గ్రామ దళిత యువకులపై పెత్తందారులకు చెందిన కొందరు యువకులు చేసిన దాడి 2024 సార్వత్రిక ఎన్నికల ముందు తీవ్ర ఆందోళనకరంగా మారింది. గతంలో కడియం మండలం పొట్టిలంక గ్రామంలో దళితులపై దాడి చేసిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో 8 మంది గాయపడిన ఘటన 2009 సార్వత్రిక ఎన్నికల ముందు రాష్ట్రంలో పెనుదుమారాన్ని రేపింది. ఈ తరహాలోనే ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కడియపు సావరం దళిత యువకులపై వ్యూహాత్మకంగా దాడి జరిగింది. దీనిపై జిల్లాలోని ప్రధాన రాజకీయ పార్టీలతోపాటు పలువురు నాయకులు మౌనంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. దాడి జరిగి 24 గంటలైనా ప్రధాన వార్తాస్రవంతిలో గాని, సోషల్ మీడియాలో గాని కనీస సమాచారం లేకపోవడం విస్మయాన్ని గురిచేస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గతంలో అనేక దాడులు జరిగిన సందర్భాలు ఉన్నాయి. శనివారం రాత్రి కడియం మండలంలోని కడియపు సావరం గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు జాగారంలో భాగంగా గ్రామానికి చెందిన దళిత యువకులు పాల్గొన్నారు. గతేడాది ఇదే జాతరలో దళితులు, పెత్తందారుల యువకుల మధ్య ఘర్షణ జరిగిన నేపథ్యం ఉంది. ఈ ఏడాది జాతరలో భాగంగా దళిత యువకులు లక్ష్యంగా చేసుకుని శనివారం రాత్రి 11 గంటల ప్రాంతం నుంచే పెత్తందారులకు చెందిన కొందరు యువకులు తొలుత కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ కవ్వింపు చర్యలు మితిమీరాయి. 12 గంటల ప్రాంతంలో 10వ తరగతి దళిత విద్యార్థిపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిని దళిత యువకులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట కాస్తా దాడికి దారి తీసింది. ముందస్తుగా దాడి చేయాలనే పథక రచన చేసుకున్న పెత్తందార యువకులు ఒక్కసారిగా ఇటుక రాళ్ళు, గాజు సీసాలతో దళితులపై దాడులకు దిగారు. యువకులు తేరుకునే లోపే క్షణాల్లో దాడి చేసి పరారయ్యారు. దీంతో కొందరు గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం నుంచి అదనపు బలగాలను హుటాహుటిన కడియపు సావరం గ్రామానికి తరలించారు.

అప్పటికే దాడిలో గాయాలపాలైన దళిత యువకులను శీలం రాజేష్, రేగుళ్ల కార్తీక్, శీలం నరసింహం, రేగుళ్ల మహేష్, రేగుళ్ల సురేష్‌లతోపాటు, మరికొంత మంది యువకులు చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి బయలుదేరారు. పోలీసులు వారిని అడ్డగించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సెల్‌ఫోన్లను సైతం లాక్కున్నారు. తీవ్రంగా గాయపడిన శీలం రాజేష్, రేగుళ్ల కార్తీక్‌లను వైద్య సహాయం నిమిత్తం తరలించాలని వేడుకున్నా పోలీసులు వారిని కాలు కదపనివ్వలేదు. బాధితుల నుంచి తీవ్రమైన ఒత్తిడి రావడంతో ఎట్టకేలకు కడియం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అదనపు బలగాలతోపాటు పోలీసు ఉన్నతాధికారి కడియపు సావరం గ్రామానికి చేరుకుని గ్రామాన్ని దిగ్బంధనం చేశారు. బాధిత యువకుల కుటుంబ సభ్యులను గ్రామం విడిచి బయటకు రానీయకుండా అడ్డుకున్నారు. అనంతరం తెల్లవారు జాము 4 గంటల సమయానికి పోలీసు ఉన్నతాధికారికడియం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. అనంతరం కడియం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులను మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితులను గంటలపాటు పోలీస్ స్టేషన్లోనే నిర్బంధించిన పోలీసునలు దాడికి పాల్పడిన వారిని మాత్రం అదుపులోకి తీసుకోక పోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ప్రధాన వార్తా స్రవంతిలో గాని, సోషల్ మీడియాలో గాని వైరల్ కాకుండా పోలీసులతోపాటు, కొందరు స్థానిక రాజకీయ నాయకులు జాగ్రత్త పడ్డారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దళితులపై ఒక సామాజికవర్గం జరిపిన వ్యూహాత్మక దాడిపై స్పందిస్తే ఒకవర్గం ఓట్లను దూరం చేసుకోవాల్సివస్తుందనే కారణంతోనే ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు నోరు మెదిపేందుకు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ్‌కుమార్ ఆదివారం మధ్యాహ్నం కడియం సిఐను కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాతర ముగిసేవరకూ సంయమనం పాటించాలని పోలీసులు కోరారు.

దాడి ఘటనకు సంబంధించి సిసి ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని సిఐ తులసీధర్ తెలిపారు. వివాదానికి కారణమైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఘర్షణపై కేసు నమోదు చేశామన్నారు. గాయపడిన దళిత యువకులను మెరగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆయన వివరించారు. సౌత్ జోన్ డిఎస్‌పి అంబికాప్రసాద్ నగరంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న శీలం రాజేష్‌ను విచారించారు. దాడికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. దాడుల నేపథ్యంలో దళితులు భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు. గతంలో పొట్టిలంక ఘటన జరిగినప్పుడు ప్రాణ నష్టం జరిగిందని గుర్తు చేసుకుంటున్నారు. ఈ దాడిపై సమగ్ర విచారణతోపాటు, వ్యూహాత్మకంగా దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని దళితులు డిమాండ్ చేస్తున్నారు.

ఓటుపై అవగాహనా సదస్సులు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట ఓటు హక్కు వినియోగంపై ఆదివారం అవగాహనా సదస్సులు నిర్వహించారు . ఈ సందర్భంగా ఓటు ప్రాధాన్యతను వివరించారు

అమలాపురం ఎస్‌కెబిఆర్ కళాశాల్లో జరిగిన వాకర్స్ హెల్త్ క్లబ్ సమావేశానికి ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా రేట్ పియర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వైడి. రామారావు హాజరు అయ్యారు. ముఖ్యఅతిథిగా ఓటు హక్కు పై ఆయన ప్రసంగించారు. ప్రతి వ్యక్తి తన ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలని ఆయన అన్నారు. మరో అతిథి బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడి శరత్ బాబు వాకర్స్ ఆరోగ్యం పై మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి సెక్రెటరీ వలవల నాయుడు ట్రెజరర్ పచ్చి గోళ్ళ రాజా గౌరవ అధ్యక్షులు డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి, ఏరియా కోఆర్డినేటర్ గోకరకొండ నాగేంద్ర మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు బోమ్మిడిపాటి పద్మావతి తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనీ, ప్రశాంతమైన వాతావరణం లో. ఎన్నికలు జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని రామచంద్రపురం సిఐ పి.దొరరాజు తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ఎన్నికలపై ప్రజలకు అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని,పాత నేరస్తులను రౌడీషీటర్లను. అదుపులో తీసుకుని. కౌన్సిలింగ్ ఇచ్చి వ్యక్తిగత పూచికత్తులపై విడుదల చేశామని వివరించారు. ఓటర్లు అందరూ నిర్భయంగా ఓటు హక్కు ఉపయోగించు కునేందుకు. కేంద్ర బలగాల తోనూ. స్థానిక పోలీసులతోను. పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు .ఈ కార్యక్రమంలో సిఐ పి.దొరరాజు తో పాటు, ఎస్ఐ. సురేష్ బాబు, ప్రత్యేక బలగాలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.



సదస్సులోమాట్లాడుతున్న రామచంద్రపురంపట్టణ సిఐ. దొరరాజు

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత బిఎండి పరీక్షలు

ప్రజాశక్తి-మండపేట

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బురుగుంట చెరువు వైఎస్ఆర్ పార్కు ఆవరణలో క్లబ్ అధ్యక్షుడు కోన సత్యనారాయణ సారథ్యంలో ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు..టోరంట్ కంపెనీ వారిచే నిర్వహించిన ఉచిత బిఎండి మెడికల్ క్యాంపులో డాక్టర్ బిక్కిన తాతబ్బాయి (బిటి చౌదరి) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బిఎండి పరీక్షలు ద్వారా కీళ్లనొప్పుల శాతాన్ని గుర్తించారు. ఎముకల సాంద్రతను పరీక్షించి కాల్షియం పెరగడానికి తగిన సూచనలు చేశారు. ఆహార నియమాలు, నడక వంటి చిన్న చిన్న వ్యాయామాలు చేస్తే మంచిదని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల దాటిన స్త్రీ, పురుషులు ఆస్టియో పోరోసిస్, ఆర్థరైటిస్, కీళ్లనొప్పులు వంటి సమస్యలు రావడం సహజమన్నారు. తగ్గడానికి తగిన ఆహారం పోషకాహారం తీసుకోవాలన్నారు. కాల్షియం పెరగడానికి వాడే మందులను వైద్యుల సలహా మేరకు వేసుకోవాలన్నారు. సుమారు 82 మందికి పరీక్షలు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రెడ్డి రవిరాజు, తాతపూడి సుధీర్, గంపల సత్యప్రసాద్, తిరుశూల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నూకాలమ్మకు వెండి గరగ సమర్పణ

ప్రజాశక్తి -మామిడికుదురు

మామిడికుదురు గ్రామ దేవత నూకాలమ్మ జాతర ఘనంగాన నిర్వహిస్తున్నారు. స్వర్గీయ ఈలి జగన్నాథరావు కుమారుడు శ్రీనివాసరావు, అలివేలు మంగతాయారు దంపతులు ఆదివారం వెండి గరగను అమ్మవారికి సమర్పించారు. గరగ 1750గ్రాములు బరువు కలిగి, రూ.1.42లక్షలు విలువ ఉంటుందని దాత తెలిపారు. గరగను సంప్రో క్షణ చేసిఆలయ అసాదులకు అందచేసి జాతర లో వినియోగించారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి జాతర

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

అంగర, కపిలేశ్వరపురం గ్రామాల్లో కొలువై ఉన్న నూకాంబిక అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం గ్రామాల్లో డప్పు వాయిద్యాలు, బ్యాండు మేళాలు , గరగ నత్యాలు, విచిత్ర వేషాలతో, బాణసంచ నడుమ అమ్మవారి జాతర నిర్వహించారు. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమ, గాజులు, చీర, రవిక, నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు . జాతర మహోత్సవం సందర్భంగా ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాలతో పాటు మహిళలు, గ్రామస్తులు, యాత్రికులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

స్థానిక దేవి సెంటర్లోని ప్రాథమిక పాఠశాలలో శనివారం రాత్రి పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సమావేశంలో జిల్లా అకడమిక్ మోనటరింగ్ అధికారి ఎఎంఒ పి.రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక పునాది విద్య అందించబడుతుందని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. విజేతలకు బహుమతులను అందజేశార.కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం వంగా శ్రీనివాస్, డివి రాఘవులు, పిఎంసి చైర్మన్ మేక లక్ష్మి దుర్గ, యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు ఎంవి.రమణారావు, హెచ్ఎం అంబటి శ్రీనివాస్, అగస్తీశ్వర రావు , ఎంఐఎస్.సురేష్, సి ఆర్ పి సరిత, వెంకటేష్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు , ఎంఆర్‌సి సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు .



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

'జగ్గిరెడ్డివి అసత్య ఆరోపణలు'

ప్రజాశక్తి-కొత్తపేట

ఎన్నికలు వచ్చే ప్రతిసారీ అసత్య ఆరోపణలు చేయడం ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డికి అలవాటుగా మారిందని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి అన్నారు. ఆదివారం విలేకరులతో ముత్యాల బాబ్జి మాట్లాడుతూ నియోజక వర్గంలో ఎంఎల్ఎగా ఉంటూ చిర్ల జగ్గిరెడ్డి చేసిన అవినీతి, అరాచకాలు నియోజకవర్గ ప్రజలు గుర్తించారన్నారు. ఈ ఎన్నికల్లో భారీ తేడాతో ఓడించి ఇకపై ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితిని కల్పిస్తారని విమర్శించారు పదేపదే మీరు చెప్తున్న అబద్ధాలను ప్రజలకు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. జగ్గిరెడ్డి మాయ మాటలకు విసిగి వేశారిన ప్రజలు తగు రీతిలో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు .

అవయవదాత 'రాజు' కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-మండపేట

ఇటీవల ప్రమాదానికి గురై బ్రెయిన్ డెడ్ కావడంతో అవయవ దానం చేసిన మండలంలోని మారేడుబాక నివాసి కాదా రాజు కుటుంబ సభ్యులను ఆదివారం ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పరామర్శించారు. బాధితుల నివాసానికి వైస్ చైర్మన్ పిల్లి గణేష్, పెంకే గంగాధర్, శెట్టిబలిజ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రాజు చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళి అర్పిం చారు. రాజు మరణం బాధాకరం అయినప్పటికీ అవయవ దానం చేసి అందరి మనసు గెలుచుకున్నారన్నారు. కార్యక్రమంలో మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, వైసీపీ నాయకులు సూరంపూడి సత్యప్రసాద్, టేకి దుర్గారావు, కొండపల్లి రాజేంద్రప్రసాద్, యాంద్ర బుజ్జి, చొల్లంగి గోవిందు, ముల్లేటి వెంకటరమణ, వాసంశెట్టి కామేశ్వరరావు, వల్లు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు

క్షతగాత్రులను పరామర్శ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ముమ్మిడివరం నగర పంచాయతీ బొండాయికోడు తూము వద్ద 216 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు పరామర్శించారు. బాధితులను ధైర్యం చెప్పి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న జెడ్‌పిటిసి సభ్యుడు సంపద రావు

ధర్మారావు విజయానికి కృషి

ప్రజాశక్తి -ముమ్మిడివరం

ముమ్మిడివరం అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాలెపు ధర్మారావు విజయానికి కార్యకర్తలతో కలిసి కృషి చేస్తానని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పి.ఉదయ భాస్కర వర్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మారావు విజయానికి గ్రామ స్థాయి కార్యకర్తలు, నాయకులతో కలిసి పని చేస్తానని అన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-రామచంద్రపురం

టిడిపి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ ఆదివారం కె.గంగవరం మండలం మసకపల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని అగ్నికుల క్షత్రియులు, యువత మహిళలు టిడిపిలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మట్లాడుతూ మత్స్యకారుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో చింతపల్లి వీరభద్రరావు, రేవు శ్రీను, మాజీ జెడ్పిటిసి సభ్యుడు మేడిశెట్టి రవికుమార్, పెమ్మాడీ సత్తిబాబు, ఎం. శ్రీనివాసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్చెన్న కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-రాజోలు

మాతృయోగంతో బాధ పడుతున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యులను ఆదివారం రాజోలు నియోజకవర్గ టిడిపి నేతలు పరామర్శించారు. టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పిఠాపురం నియోజకవర్గ పరిశీలకులు బోళ్ళ వెంకటరమణ, టిడిపి మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు ఆదివారం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ వెళ్ళి అచ్చెన్నాయుడు, ఆయన సోదరులు ప్రసాదరావు నాయుడు, ప్రభాకరరావు నాయుడులను పరామర్శిం చారు. అచ్చెన్న మాతమూర్తి కళావతమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గరుడ, సింహ వాహనాలపై శ్రీనివాసుడు

ప్రజాశక్తి -ఆత్రేయపురం

వెంకన్న కళ్యాణోత్సవాల ముందు జరిగే స్వామివారి అధ్యయనోత్సవాలు మూడవరోజు ఆదివారం స్వామివారికి ఉదయం నుంచి పండితులు చతుర్వేద పారాయణ ద్రవిడ వేదపారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి. గరుడ వాహనం, సింహ వాహనాల సేవ పల్లకీపై స్వామి వారి గ్రామోత్సవం జరిగింది స్వామివారికి చంగోళం పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిసి భూపతి రాజు కిషోర్ కుమార్ ఏర్పాట్లు పూర్తి చేసి పర్యవేక్షించారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న రాజేష్

ఇద్దరు బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -మామిడికుదురు

పాశర్లపూడిలంకలోఅనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి లూటుకుర్తి కీర్తన, ఉప్పాటి రమేష్ లను ఎమ్ఆర్‌పిఎస్ జిల్లా అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్ ఆదివారం కలిశారు.వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుని రూ.5 వేల చొప్పున ఇద్దరికీ కలిపి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ మన తోటి వారి ఇబ్బందులను పంచుకుని తన వంతు అండగా ఉండేందుకు వచ్చానని తెలియజేశారు. భవిష్యత్తులో కూడా మందకష్ణమాదిగనాయకత్వంలో ముందుకు నడుస్తూ వర్గీకరణ కోసం పోరాడతానని అన్నారు. ఇబ్బందుల్లో ఉన్నవారికి అండగా నిలుస్తానని అన్నారు. స్థానికులు రాజేష్ ను అభినందించారు. కార్యక్రమం లో శ్రీరామ్, తేజ, భాను, కార్తిక, ధీరజ్ పలువురు మాదిగ యువత పాల్గొన్నారు.

పలువురు నాయకులను కలిసిన సత్యనారాయణ

ప్రజాశక్తి -మామిడికుదురు

పాశర్లపూడి లంక, లూటుకుర్రు, ఆదుర్రు గ్రామాల్లో ఆదివారం పి. గన్నవరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ఆదివారం పలువురు ప్రముఖులు ఆత్మీయంగా కలిశారు. అందరి సూచనలు సలహాలతో సేవలు అందిస్తామన్నారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు అడబాల తాతకాపు, ఎంపిటిసి నామన వెంకటేశ్వరరావు, బోణం సత్య నాగేశ్వరరావు, ఆదుర్రు సర్పంచ్ సర్పెంచ్ బళ్ళ శ్రీనివాస రావు తదితరులతో కలిసి గిడ్డి సత్యనారాయణ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు

ఆత్రేయపురంలో 'ప్రజాగళం'

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఆత్రేయపురంలో గ్రామంలో ఆదివారం ప్రజాగళం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి బండారు సత్యానందరావు, నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, పార్లమెంట్ అభ్యర్థి గంటి హరీష్ మాధురి పాల్గొన్నారు. భారీ సంఖ్యలో గ్రామస్తులు హాజరై పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దళితుల మీద దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. టిడిపి అధికారంలో ఉండగా గ్రామాన్ని అభివద్ధి చేశామన్నారు. వైపిపి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎంఎల్ఎ అభివద్ధిని తుంగలో తొక్కారని విమర్శించారు. గ్రామంలో అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించలేదని, అధికారంలోకి వస్తే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గంటి హరీష్ ను, తనను గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకరరావు పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీలో వివిధ నియోజకవర్గాలకు పార్టీ పోటీచేసే అభ్యర్థులను అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఇటీవల ప్రకటించిందని కామన ప్రభాకర రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనేపథ్యంలో ఇప్పటి వరకు నియోజకవర్గ స్థాయిలో కన్వీనర్లుగా పని చేసిన వారిని ఆ పదవుల నుంచి విరామం ఇచ్చారని అన్నారు. ఇప్పటి వరకు ఉన్న కన్వీనరులు వారి పూర్వపు పదవుల్లో కొనసాగుతారని తెలిపారు. ఇక నుంచి అభ్యర్థులు నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీ కార్య క్రమాలు చేపట్టి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. తక్షణం ఈ ఆదేశం అమలులోకి వస్తుందని కామన తెలియజేశారు. ఇప్పటి వరకూ నియోజక వర్గ కన్వీనర్‌లుగా పనిచేసిన నాయకులు అందరికీ అభినందనలు తెలియజేశారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో వేణుసాగర్‌కు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రాష్ట్ర స్థాయి అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ముమ్మిడివరం హెల్దీ లైఫ్ జిమ్ కు చెందిన దొమ్మేటి వేణు సాగర్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఇటీవల ఎన్‌టిఆర్ జిల్లా చిల్లకల్‌లో జరిగిన 67 వ రాష్ట్ర స్థాయి అండర్ 17 పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. పాల్గొన్న వేణు సాగర్ 355 కేజీల విభాగంలో ముమ్మిడివరం నగర పంచాయతీ కి చెందిన హెల్దీ లైఫ్ జిమ్ విద్యార్థి వేణు సాగర్ గోల్డ్ మెడల్ సాధించి, జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైయ్యాడు. జాతీయ పోటీలకు ఎంపికైన వేణు సాగర్ కు జిమ్ నిర్వాహకుడు వాసంశెట్టి నరేష్ సమకూర్చిన సుమారు రూ.40 వేల విలువ కలిగిన పవర్ లిఫ్టింగ్ కాస్ట్యూమ్స్ ను స్థానిక సిఐ ఎన్.కొండయ్య చేతులు మీదుగా ఆదివారం విజేతకు అందజేశారు. సిఐ మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో లక్ష్య సాధనకు కషి చేస్తే విజయాలను సాధించవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిమ్ సభ్యులు సైధం వంశీ, ఇండుగుల కుమార్, సంసాని నాగరాజు, టేకి విరేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతతో అవస్థలు

ప్రజాశక్తి రామచంద్రపురం

రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పల్లె ప్రాంతాలు సైతం వేడెక్కిపోతున్నాయి. వాతావరణంలో వస్తున్న తీవ్ర మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు పెరిగిపోయి పల్లెల పైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పచ్చని చెట్లతో నిత్యం చల్లగా ఉండే గోదావరి జిల్లాలు గత మూడు రోజులుగా కాస్తున్న ఎండలకు అల్లాడిపోతున్నాయి. ఉదయం 11 గంటల నుండి ఎండ తీవ్రత పెరిగి వడగాలుపులు వీస్తున్నాయి. దీనితో ఉక్కపోత మొదలై సాయంత్రం నాలుగు గంటల వరకు తీవ్రమైన చెమటలు పట్టి ఎండ వేడిమికి తాళలేని పరిస్థితి ఏర్పడుతుంది. వద్ధులు చిన్నపిల్లలు ఈ ఎండలకు తట్టుకోలేక మరింత ఇక్కట్లకు గురవుతున్నారు. వడగాల్పులు వీచే అవకాశం ఉండటం వల్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని బయటకు వెళ్లేటప్పుడు టోపీలు ధరించాలని, వడదెబ్బ తగలకుండా మంచినీరు ద్రవపదార్థాలు ఎక్కువ తీసుకోవాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం వరకు పల్లెల్లోని రోడ్ లు కూడా నిర్మాణుష్యంగా ఉండి కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు



రోడ్డు ప్రమాదంలో తిరగబడిన ఆటో

రోడ్డు ప్రమాదంలో 8 మందికి గాయాలు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పెళ్లి బందంతో వెళుతున్న ఆటోను వెనక నుండి ట్రక్కు ఆటో డీ కొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు ప్రయాణికులతో పాటు ఆటో డ్రైవర్ గాయపడ్డారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి 216 బొండాయి కోడు పెట్రోల్ బంకు ఎదురుగా ఆదివారం ఈ ప్రమాదం జరిగింది. వివరాల ప్రకారం.. ఉప్పలగుప్తం మండలం కూనవరం నుంచి ఎస్.యానాం శుభ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళుతున్న ఆరుగురు మహిళలు ఒక వ్యక్తి ఉన్న ఆటోను వెనక నుండి ట్రక్ ఆటో ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జు నుజ్జు అవటంతో ఆటోలో ప్రయాణిస్తున్న కూనవరం చెందిన నేలపాటి రమేష్ బాబు, నేలపాటి లోవ కుమారీలతో పాటు చల్లపల్లి కి చెందిన కాగిత సుహాసినిలు తీవ్రంగా గాయపడ్డారు. చల్లపల్లి కి చెందిన కాగిత దుర్గా రత్నం, బుంగా నరసమ్మ కూనవరం కు చెందిన బడుగు రాజేశ్వరి కిత్తన చెరువుకు చెందిన జొన్నాడ ధనలక్ష్మి కునావరం కు చెందిన ఆటో డ్రైవర్ నేలపాటి రమేష్‌లు గాయపడ్డారు. గాయపడిన వీరిని అమలాపురం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ దీనిపై ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాడుతున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కట్టమూరు పుంతలో ఆదివారం సాయంత్రం పోలీసులు పేకాట స్థావరంపై నిర్వహించిన దాడుల్లో ఐదుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ వి.సురేష్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.9 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.



స్వాధీనం చేసుకున్న పిడిఎస్ బియ్యం

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని స్థానిక అగ్రహారంలో 900 కేజీల పిడిఎస్ బియ్యాన్ని ఆదివారం అధికారులు పట్టుకున్నారు. సివిల్ సప్లయాస్ అధికారులకు అందిన సమాచారం మేరకు అగ్రహారంలో ఓ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. బి.ప్రత్తిపాడుకు చెందిన బి.చక్రారావు పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్టు గుర్తించి కేసు నమోదు చేశారు. పిడిఎస్ బియ్యం నిల్వ చేసేందుకు ఎవరైనా ఇల్లు అద్దెకిస్తే వారిపైనా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లయాస్ డిప్యూటీ తహశీల్దార్ వీరాస్వామి, పట్టణ అదనపు ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు మహాశయా.. మేలుకో

- జాబితాలో పేరు చూసుకోవాల్సిన తరుణమిదే.
- ఏప్రిల్ 15 వరకు నమోదు, చిరునామా మార్పునకు అవకాశం





ప్రజాశక్తి-రాజోలు

సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. ఐదేళ్లకోసారి పాలకులను ఎన్నుకునే తరుణం ఆసన్నమైంది. మనం వేసే ఒక్క ఓటు కూడా రాజకీయాలను శాసించి గెలుపోటములను నిర్ణయిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో సరిచూసుకోవాలి. పేరు లేకుంటే వెంటనే ఓటు నమోదుకు దరఖాస్తు (ఫారం-6) చేసుకోవాలి. ఏప్రిల్ 15 వరకు గడువు ఉండటంతో అర్హులంతా మేలుకోవాలి. లేకుంటే ఓటేసే పరిస్థితి ఉండదు.

యువతను నమోదు చేయించేనా..

కొత్తగా ఓటు హక్కు పొందేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. 18 ఏళ్లు నిండినవారు ఏప్రిల్ 15వ తేదీలోగా కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జనాభా పరంగా 18-19 ఏళ్ల వయస్సు ఉన్నవారు 1.84 లక్షల మంది ఉన్నారు. ఎన్నికల షెడ్యూలు ముందు వరకు 82 వేల మంది యువత ఓటర్లుగా నమోదయ్యారు. మరో 1.01 లక్షల మంది దూరంగా ఉన్నారు. ఎన్నికల సంఘం ఆదేశానుసారం స్వీప్ కార్యక్రమాలను విస్తతం చేయడంతోపాటు ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహించడం, ఓటుకు దూరంగా ఉన్న యువతకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలి. వీరిని ఓటరుగా చేర్పించడంపై జిల్లా యంత్రాంగం గత ఆరేడు నెలలుగా చర్యలు చేపట్టినా పెద్దగా ఫలితం లేకుండా పోయింది. యువతీయువకులను ఓటర్లుగా నమోదు చేయించడంపై దష్టిపెడితే బాగుంటుందని రాజకీయ పక్షాలు పేర్కొంటున్నాయి.

జాబితాలో పేరు లేకుంటే..

ఓటరు జాబితాలో పలువురి పేర్లు గల్లంతయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలో పేరు ఉందో.. లేదో చూసుకుంటే సరిచూసుకోవాలి. లేకుంటే వెంటనే దరఖాస్తు చేసుకుంటే అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తారు. జాబితాలో పేర్లు లేనివారు తమ సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో బిఎల్ఒలను సంప్రదించాలి. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. కొత్తగా ఓటు నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. చిరునామా మార్పునకు ఫారం-8 ఉపయోగించాలి. బీఎల్వోలకు ఓటరు దరఖాస్తులు అందజేయొచ్చు. ఆన్‌లైన్, ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. https://ceoandhra.nic.in, https://voters.eci.gov.in వెబ్‌సైట్లను సైతం సంప్రదించవచ్చు.

కుటుంబ సభ్యులను విడదీశారు..

ఈ ఏడాది జనవరి 22న విడుదల చేసిన తుది ఓటరు జాబితాలో పలువురి ఓట్లు జంబ్లింగ్ అయ్యాయి. భార్య, భర్త, కుటుంబ సభ్యుల ఓట్లు రెండు, మూడు పోలింగ్ కేంద్రాల్లో ఉన్నాయి. ఓటర్ల నివాస ప్రాంతాలకు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రాలు ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం 2019 కంటే తక్కువగా నమోదయ్యే అవకాశముందని రాజకీయ పార్టీల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2019 ఎన్నికల్లో అమలాపురం లోక్‌సభ నియోజకవర్గంలో ప్రస్తుతం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 2019లో 12,32,895 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 84.47 శాతం పోలింగ్ నమోదైంది. విన్నింగ్ మార్జిన్ 39,795 శాతం. పోలింగ్ జరిగింది. అమలాపురం 83.1శాతం, రామచంద్రపురం 87.1శాతం ముమ్మిడివరం 83.6 శాతం, రాజోలు 80 శాతం, గన్నవరం82.4 శాతం, కొత్తపేట84.4 శాతం, మండపేట 86.9 శాతం ఓట్లు నమోదు అయ్యాయి.

అవగాహన కల్పించక

నూటికి 70 మందికిపైగా ఓటర్లు ఇప్పటివరకు తుది ఓటరు జాబితా మొహం చూడలేదు. తమ ఓట్లన్నీ గతంలో ఓటేసిన పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉంటాయని వారు భావిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలు తారుమారాయన్న విషయం చాలామందికి తెలియదు. వాస్తవానికి ఓటరు ఓటు ఎక్కడుందో పోలింగ్ బూత్ స్థాయి అధికారులు వివరించాలి. ఏదైనా తప్పిదం జరిగి ఉంటే వారి చేత ఫారం-8 దరఖాస్తులు పెట్టించి నివాస ప్రాంత సమీపంలోని పోలింగ్ కేంద్రాలకు మార్చేలా చూడాలి. కానీ వారు ఏమాత్రం అవగాహన కల్పించడం లేదు. ఓటు హక్కు కల్పించాం.. వారి ఓటు ఎక్కడుంటే మాకేంటి అన్న ధోరణిలో ఉండిపోయారు.

చిరునామాలో మార్పులకు...

ఓటరు ఒక పోలింగ్ స్టేషన్ పరిధి నుంచి మరో స్టేషన్ పరిధిలోకి మారినా, నివాసం మారినా చిరునామా మార్చుకోవచ్చు. ఒక నియోజకవర్గంలో ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి, ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి ఓటరు తన చిరునామా మార్పునకు ఏప్రిల్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

ప్రతి ఒక్కరూ ఆరోగ్యనియమాలు సక్రమంగా పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించవచ్చని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పిఎన్ఎస్‌డి.రత్నకుమారి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం కపిలేశ్వరపురం మండలంలోని అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారి డాక్టర్ రత్నకుమారి ఆధ్వర్యంలో పిహెచ్‌సి వైద్య సిబ్బంది ర్యాలీ, మానవహారం, నిర్వహించారు. డా.రత్నకుమారి మాట్లాడుతూ ఆరోగ్య అలవాటు, ఆహార నియమాలపై ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించాలని సిబ్బం దికి సూచిం చారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ విజిటర్ టి.మేరీ మణి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



అంగర పిహెచ్‌సి ఆధ్వర్యంలో ర్యాలీ

ఎన్నికల నిబంధనలు పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి -అమలాపురం

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో పారదర్శకంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఎన్నికల నిర్వహ ణలో నిమగ్నమైన అధికారులకు ఆదివారం ఒక ప్రకటన ద్వారా సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిం చాలని జిల్లా కలెక్టర హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎన్నికల నిర్వహ ణలో నిమగ్నమైన అధికారులకు ఆయన సూచించారు ఎన్నికల ప్రవర్తనా నియ మావళి అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు ఎన్నికలలో పోటీ చేయమన్న అభ్యర్థులు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారం, కరప త్రాల ముద్రణ పంపిణీ తదితర ప్రచార కార్యక్రమాలకు ముం దస్తు అనుమతులు తప్పనిసరిగా తీసు కోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు, రాజకీయ పార్టీ నాయకుల వెంట ర్యాలీల్లో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనరాదని స్పష్టం చేశారు. జిల్లాలో రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిష్పక్షపాతంగా, సమర్థంగా అమలు చేయాలని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్ని కల కోడ్ అమలవుతున్న తీరు, ఫిర్యా దుల పరిష్కారం, రిపోర్టింగ్ మేనేజ్మెంట్, ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్ తదితరాల్లో ఎక్కడ నిర్లిప్తత ప్రదర్శించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఇకపై కూడా ఎన్నికల నియమావళి మరింత పటిష్ట అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. చెకోపోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బందాలు అప్రమ త్తంగా ఉండాలన్నారు. నియోజ కవర్గాలవారీగా ఎంసిసి బందాలు మరింత క్రియాశీలంగా పనిచే సేలా చూడాలన్నారు.క్షేత్రస్థాయి బందాలతో పోలీస్, ఎస్ఇబి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఐటీ, ఫారెస్ట్, బ్యాంకింగ్ తదితర ఎన్ఫోర్స్మెంట్ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మద్యం డబ్బులు మత్తు పదార్థాల రవాణా కు సంబంధించి నిఘాను కేవలం చెక్ పోస్టులకే పరిమితం చేయకుండా ఇతర, కొత్త మార్గాలకూ విస్తరించాలని సూచించారు. కంట్రోల్ రూమ్, వాట్సాప్ నంబర్, సీ విజిల్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్, మీడియా మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల్లో నిష్పక్షపాత మీడియా పాత్రను భారత ఎన్నికల సంఘం ఆశిస్తోందన్నారు.. పెయిడ్ న్యూస్ ద్వారా విఘాతం కలగకుం డా అడ్డుకునేందుకు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతోపాటు పెయిడ్ న్యూసు ఈ కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. మీడియా ఉల్లంఘనలు కూడా గుర్తించి తగిన చర్యలు చేప డుతుందన్నారు. రాజకీయ ప్రచార ప్రకటనలను ఇచ్చేందుకు మూడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకో వాల్సి ఉంటుందన్నారు. రిజిస్టర్ కాని పార్టీలు, ఇతర వ్యక్తులు వారి ప్రకటనల ప్రసారం కోసం ఏడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.. అభ్యర్థులు తమ ప్రకటనలు ఎందులో ఇవ్వదలుచుకున్నారో మేరకు సిడిలో వీడియో, ఆడియో రికార్డు చేసుకుని ప్రకటన టైటిల్, ప్రకటన తయారీకి అయిన ఖర్చు, ప్రకటనలు ఇచ్చేందుకు అయ్యే ఖర్చు వంటివి సూచిస్తూ దర ఖాస్తు చేసుకోవాలన్నారు కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్లోని ఎంసిఎంసీ కమిటీకి రెండు సెట్ల దరఖాస్తు ఇవ్వాలని. సర్టిఫికెట్ లేని ఎన్నికల ప్రకటనలు ఎవరూ ప్రదర్శిం చడానికి వీలు లేదన్నారు.



కలెక్టర్ హిమాన్షు శుక్లా

నరసింహారావుకు డాక్టరేట్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల హ్యుమానిటీస్ అండ్ బేసిక్ సైన్సెస్ విభాగం సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఐ.నరసింహారావు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నట్లు ఆదిత్య విద్యసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ప్రొపెసర్ జివిఎస్ఆర్.ఆంజనేయులు నేతృత్వంలో "ఆల్ఫా లాగరిథమ్ ట్రాన్స్‌ఫార్మ్డ్ సెమీ లాజిస్టిక్ డిస్ట్రిబ్యూషన్ కోసం వివిధ కంట్రోల్ చార్ట్‌లపై అధ్యయనం" అనే అంశంపై అతను సమర్పించిన థిసిస్‌కు ఈ డాక్టరేట్ పొందారని తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషా రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రమేష్, డీన్ పిఎస్‌విఎస్.రవికుమార్, హ్యుమానిటీస్ అండ్ బేసిస్ సైన్సెస్ విభాగాల అధిపతులు బి.జ్యోతి మరియు డాక్టర్ సి.రాజశేఖర్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు డాక్టర్ ఐ.నరసింహారావుని అభినందించారు.

అమరవీరులను స్మరించుకుందాం

ప్రజాశక్తి - పిఠాపురం

దేశ రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలను కోల్పోయిన అమరవీరులను ప్రతి ఒక్కరు స్మరించు కోవాలని సిఐ జి.శ్రీనివాస్ అన్నారు. 2014 సంవత్స రంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు జరిపిన ఐఇడి పేలుడులో ప్రాణాలు కోల్పోయిన రథాలపేటకు చెందిన సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ తోట పున్నారావు త్యాగాన్ని స్మరించుకుంటూ అమరవీరుల దినోత్సవాన్ని జరిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ దేశ సేవలో తన ధైర్యసాహసాలు, త్యాగం చేసిన కానిస్టేబుల్‌కు నివాళు లర్పించినట్లు తెలిపారు. అనంతరం కానిస్టేబుల్ తల్లి సన్యాసమ్మను సన్మానించారు. అనంతరం అధికారులు, ఎన్‌సిసి విద్యార్థులు మార్చిపాస్ట్, కుటుంబ సభ్యులలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం మండల విద్యాధికారి ఆర్‌వి. ప్రసాద్, ఎస్ఐ ఆర్.మురళి మోహన్, సిఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ పి.రమేష్, రథాలపేట ఎవైఎం యూత్ నాయకులు చిల్లి నుకరాజు, నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణకు ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ

రానున్న ఎన్నికల నేపథ్యంలో విధి నిర్వహణలో ఉండే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఈ నెల 12,13 తేదీల్లో జరగనున్న శిక్షణా కార్యక్రమ ఏర్పాట్లను సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఆదివారం పరిశీలించారు. శిక్షణ జరిగే పిఆర్ కళాశాల ప్రాంగణాన్ని అధికారులతో కలిసి సందర్శించిన ఆయన చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహసీల్దార్ దొర, ఇతర ఎన్నికల అధికారులు ఉన్నారు.

లిబరేషన్ కాంగ్రెస్ అభ్యర్థిగా శ్యామ్ ప్రకాష్

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్టు బొంతా శ్యామ్ రవి ప్రకాష్ తెలిపారు. తనకు అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షుడు జిఎస్ఆర్‌కె.విజయ్ కుమార్‌కు శ్యామ్ ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు.

8న 'సంఘం శరణం గచ్ఛామి'

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 8వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు నగరంలోని సూర్యకళామందిరంలో 'సంఘం శరణం గచ్ఛామి' నృత్య రూప నాటక ప్రదర్శన ఉంటుందని యుటిఎఫ్ రాష్ట్ర పూర్వపు కార్యదర్శి జి.ప్రభాకర వర్మ తెలిపారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో ఇందుకు సంబంధించి కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జీవితం-కృషిని వివరిస్తూ హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ రూపొందించిన 'సంఘం- శరణం -గచ్ఛామి' నృత్యరూప నాటక ప్రదర్శనను అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా సిఐటియు, యుటిఎఫ్, జెవివి, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డివైఎఫ్ఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ రూపొం దించిన ఈ నాటకం 500పైగా ప్రదర్శనలు జరిగా యన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ నాటకాన్ని నగర ప్రజలు తిలకించాలని కోరారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీర బాబు మాట్లాడుతూ అంబేద్కర్ కొందరివాడు కాదు అందరివాడని చాటి చెప్పడానికే ఈ నాటకం ప్రదర్శిం చడం జరుగు తుందన్నారు. అంబేద్కర్ కృషి, ఆయన ఆశయాలు, ఆలోచనలు ఎంత విస్తృతంగా ఉన్నాయో ఈ నాటకం చూస్తే రేఖామాత్రంగా అర్థం అవుతుం దన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.గోవిం దరాజులు, వివి.రమణ, పాములయ్య పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు జెఎన్ఎస్.గోపాలకృష్ణ, రగ్బీ అసోషియేషన్ అధ్యక్షులు ఇమిడిశెట్టి నాగేంద్రకుమార్ ప్రారంభించారు. ఉమ్మడి జిలాల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, వారిలో బంగా రం 7, సిల్వర్7, కాంస్యం 10 పతకాలు మొత్తం 24 మంది పతకాలు గెలుచు కున్నారన్నారని ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలి పారు. విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సి హెచ్‌వి.రమణ, కె.చిన్నబ్బాయి, జి.శివప్రసాద్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

కాంగ్రెస్ పార్టీతోనే యానాం అభివృద్ధి

ప్రజాశక్తి - యానాం

కాంగ్రెస్‌తోనే యానాం అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జ్ మల్లాడి సత్తిబాబు అన్నారు. ఆదివారం స్థానిక ఫరంపేట, అయ్యన్న నగర్, మట్ట గార్డెన్, మెట్టకూరు, రామన్నకోడు, ఫిషర్మెన్ పేట ఆది ఆంధ్ర పేట వంశీకృష్ణ కాలనీల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పేద ప్రజలకు అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాడి బీరాస్వామి, బంగారం, ప్రసాద్‌రాజు, చీకట్ల రామకృష్ణ, సుబ్బరాజు, చక్రవర్తి, కెఎస్ఆర్.చౌదరి, గొట్టుముక్కల సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో నమశ్శివాయం ప్రచారం

ప్రజాశక్తి - యానాం

ఎన్‌డిఎ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న హోంమంత్రి నమశ్శివాయం ఈ నెల 11, 12 తేదీల్లో యానాం నియోజకవర్గంలో ప్రచారం చేస్తారని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. 11న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ, అదేవిధంగా 12వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ ఆయన ప్రచారాన్ని నిర్వహిస్తారన్నారు. ఈ ప్రచార కార్యక్రమానికి సిఎం రంగసామి, పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణన్ పాల్గొంటారని తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మే 7 వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సమ్మర్ క్యాంపు పోస్టర్ను ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక యాసలపు సూరా ర్యావు భవనంలో కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన సభలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంఎస్‌సి.మూర్తి, మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్, మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి నిర్వాహకులు దేవత రాజేష్ కుమార్ తదితరులు ఈ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్ మాట్లాడుతూ వరుసగా మూడో ఏడాది కూడా ఈ సమ్మర్ క్యాంపు నిర్వహించబడుతుందన్నారు. ఉదయం కరాటే, అనం తరం డ్రాయింగ్, మ్యాథ్స్, స్పోకెన్ ఇంగ్లీష్, సైన్స్ ప్రయోగాలు వంటి అనేక అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ సమ్మర్ క్యాంపును విద్యార్థు లందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి రొంగల అరుణ్ కుమార్, యుటిఎఫ్ మండల కార్యదర్శి కెనడీ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని బలభద్రపురం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు వైసిపి నాయకులు ఆర్థిక సాయాన్ని అందించారు. గుర్రప్పాలెం గ్రామ సర్పంచ్ చీపురుపల్లి రాఘవ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద బాధితుడు గోపిశెట్టి సుబ్రహ్మణ్యం కుటుంబానికి రూ. 5 వేలు నగదు, 100 కేజీల బియ్యం, దుస్తులను అందచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అబ్బిరెడ్డి వీరబాబు, పడాల రాజశేఖర్, నక్క శ్రీను పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-గోకవరం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా మండలంలోని రంపయర్రంపాలెంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వాహక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గోకవరం, కోరుకొండ, సీతానగరం, రాజానగరం తదితర మండలాల్లో ఉన్న వాలీబాల్ క్రీడాకారులందరూ ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు టీమ్ ఒక్కటికి రూ.800 ప్రవేశ రుసుము ముందుగా చెల్లించాలని తెలిపారు. ప్రథమ, ద్వితీయ బహుమతులు ఇస్తామని చెప్పారు. ప్రథమ బహుమతిగా రూ.10,000 నగదు, ద్వితీయ బహుమతిగా రూ.6000 నగదుతో పాటు ట్రోఫీ, మెడల్ ఇస్తామని వాలీబాల్ టోర్నమెంట్ నిర్వాహక కమిటీ సభ్యులు దుమ్మల శ్రీకాంత్, కొండేపూడి విద్యాసాగర్, మట్ల గంగాధర్ తెలిపారు. ఈ టోర్నమెంట్లో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 9వ తేదీ చివరి తేదీగా నిర్ణయించినట్టు చెప్పారు. 10వ తేదీన టోర్నమెంట్ నిర్వహణకు డ్రా తీస్తామన్నారు. పూర్తి సమాచారం కోసం 9515353252 నెంబరులో సంప్రదించాలని కోరారు.

టిడిపి ఆధ్వర్యంలో 'జయహో బిసి'

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. టిడిపి నాయకులు పాల్గొని మాట్లాడారు.

ఉప్పలగుప్తం గొల్లవిల్లిలో ఆదివారం టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన ఉప్పలగుప్తం, కూనవరం,గొల్లవిల్లి, సన్నవిల్లి గ్రామాల యూనిట్‌గా జయహో బిసి సదస్సును నిర్వహించారు.మాజీ ఎంఎల్ఎ, అమలాపురం నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పాల్గొని మాట్లాడుతూ జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బిసి లను అణగ దొక్కుతూ రూ.75 వేల 760 కోట్ల బిసి సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించి 30 కు పైగా బిసి సంక్షేమ పథకాలను జగన్ రద్దు చేశారన్నారు బిసి రిజర్వేషన్ లను 34 శాతం నుంచి 24 శాతం కు తగ్గించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని అన్నారు. బిసి లకు చంద్రబాబు అండగా నిలిచారని టిడిపికి బిసిలంతా అండగా ఉండి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసే వరకూ బిసిలంతా సైనికుల్లా పని చేయాలని ఆనందరావు పిలుపునిచ్చారు. సమావేశంలో సర్పంచ్ చిక్కం పెదబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు గుత్తుల నాగేశ్వరరావు, జనసేన నాయకులు ఆకుల సూర్యనారాయణ మూర్తి,గుత్తాల సుభాష్ చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు. **అంబాజీపేట** కర్ణబత్తుల కళ్యాణ మండపం నందు జరిగిన జయహో బిసి కార్యక్రమంలో మాజీ ఎంపిపి, టిడిపి అధికార ప్రతినిధి డివివి సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగింది. మండల టిడిపి అధ్యక్షులు దంతులూరి శ్రీను రాజు పార్టీ కార్యక్రమాలలో పాల్గొనడం లేదని జెడ్‌పి మాజీ చైర్మన్ నామన రాంబాబు ను వివరణ కోరగా అటువంటిది ఏదీలేదన్నారు. టిడిపి, జనసేన, బిజెపి పార్టీలకు చెందిన బిసిను ఒకే వేదికపై సమావేశపరచగా ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ బాలయోగి లు రాకపోవడంతో ఇదేనా బీసీలపై ప్రేమ అని పలువురు బిసి నాయకులు విమర్శించారు. ఉమ్మడి పార్టీలు బిసిలకు తగిన ప్రాధాన్యత కల్పించడం లేదని కార్యక్రమంలో బిసిలు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు దొమ్మేటి సాయికష్ణ, బిజెపి ఇంచార్జ్ కె శ్రీనివాసరావు, టిడిపి ప్రధాన కార్యదర్శి గుడాల ఫణి, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు బొంతు పెదబాబు, మట్టపర్తి ఎ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గొల్లవిల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరావు



అంబాజీపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపిపి డివివి